సాక్షి
సూర్యాపేట

శనివారం ၊ 7 ၊ జూన్ ၊ 2025



నంబర్లు మార్చి.. నయా దందా!
ప్రమాదానికి గురైన ఇంజన్, చాసిస్ నంబర్లను గడువుతీరిన వాహనాలకు మార్చి విక్రయిస్తున్నారు.
- 10లో



ఉజ్వల భవిష్యత్‌కు 'నవోదయం'
నవోదయ విద్యాలయాల్లో వచ్చే విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి అర్జీలు స్వీకరిస్తున్నారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
41°/26°

వాతావరణం
పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రంగనాథస్వామి ఆలయ భూముల పరిశీలన



దేవాలయ భూముల నక్షాను పరిశీలిస్తున్న అధికారులు, దేవాలయ కమిటీ సభ్యులు

సాక్షి ఎఫెక్ట్..

కోదాడ: పట్టణపరిధిలోని రామిరెడ్డిపాలెం వద్దఉన్న అనంతగిరికి చెందిన రంగనాథస్వామి ఆలయ భూములను శుక్రవారం రెవెన్యూ, దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ సభ్యులు పరిశీలించారు. గత నెల 31న 'ఆగని ఆలయ భూమి ఆక్రమణ యత్నాలు' శీర్షికన సాక్షి లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. సర్వే నంబర్ 1024, 1025లో ఉన్న భూమి మొత్తం 24 ఎకరాలను సర్వే చేయాలని నిర్ణయించారు. దేవాలయ భూములను పరిశీలించిన వారిలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఈదుల కృష్ణయ్య, ఆలయ కమిటీ చైర్మన్ తీగల నరసింహారావు, అనంతగిరి డీటీ శ్రీధర్, సర్వేయర్ నాగార్జున తదితరులు ఉన్నారు.

ముగిసిన వేసవి శిబిరం



చిన్నారులు తయారు చేసిన వస్తువులను చూస్తున్న నిర్వాహకులు

సూర్యాపేట : బాల భవన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నెల రోజులుగా కొనసాగుతున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులు గాత్ర సంగీతం, వాయిద్యం, కుట్లు అల్లికలు, చిత్రలేఖనం నృత్యంతో పాటు మెడిటేషన్, సైన్స్ ప్రయోగ అంశాలను ప్రదర్శించి అలరించారు. ఈ కార్యక్రమానికి బాల భవన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ రామ్మూర్తి హాజరై తిలకించి విద్యార్థులు, శిక్షకులను అభినందించారు. కార్యక్రమంలో బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి రిటైర్డ్ అధ్యాపకులు కవి హమీద్‌ఖాన్, అనంతుల జయమ్మ, వెంపటి రాము, బాల భవన్ పేరెంట్స్ కమిటీ వెన్న కవితారెడ్డి, కార్టూనిస్టు పల్లె మణిబాబు, వెంకటేశ్వర్లు, మెడిటేషన్ గురువు భీష్మారెడ్డి, దాసరి ఎల్లయ్య, ఉమ, సత్యనారాయణ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాల మంజూరు సులభతరం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : రైతులకు రుణాల మంజూరు సులభం చేయడం కోసం పాలసీల్లో మార్పులు చేసినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార బ్యాంకు అంటేనే రైతుల బ్యాంక్ అని రైతుల అభివృద్ధికి బ్యాంకు సహాయ పడుతుందని తెలిపారు. రైతులు బ్యాంకులో రుణం పొంది ఏదైనా కారణం చేత మరణిస్తే వారికి ఓటీఎస్ (వన్‌టైం సెటిల్‌మెంట్) సదుపాయం కల్పించాలని తీర్మాణించినట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్రాఫ్ వైజ్‌గా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఆమోదిస్తున్నామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి, సీఈఓ శంకర్‌రావు పాల్గొన్నారు.



తుర్కపల్లి మండలంలోని తిర్మలాపురం వద్ద బహిరంగ సభ వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అయిలయ్య, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం

మూసీని ప్రక్షాళన చేసి గోదావరి జలాలతో నింపుతాం

- గత ప్రభుత్వం గంధమల్లను పట్టించుకోలేదు
- ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నా..
- తిర్మలాపూర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి, యాదగిరిగుట్ట: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో జరిగిన ప్రజాపాలన -ప్రగతిబాట బహిరంగ సభలో మంత్రులతో కలిసి గంధమల్ల రిజర్వాయర్‌తో పాటు సుమారు రూ.1051.45 కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేకపోయిందని ప్రశ్నించారు. గంధమల్లకు నీరెక్కడినుంచి ఇస్తారని ప్రశ్నించిన బీఆర్‌ఎస్ నాయకుల తీరును ఆయన దుయ్యబట్టారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి గంధమల్ల జలాశయానికి నీటిని అందిస్తామన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా గంధమల్ల రిజర్వాయర్‌ను పూర్తిచేసి తీరుతామన్నారు. అలాగే ఎస్ఎల్‌బీసీ టన్నెల్, డిండి ప్రాజెక్టు, బునాదిగాని, పిల్లాయపల్లి, ధర్మారెడ్డి కాలువలను పూర్తి చేస్తామన్నారు. గత సర్కార్ యాదగిరిగుట్టలో మెడికల్ కళాశాలను సకాలంలో ప్రారంభించలేకపోయిందన్నారు.

మూసీ ప్రక్షాళన చేసి తీరుతా..
నా పుట్టిన రోజు సందర్భంగా మూసీ వెంట పాదయాత్ర చేశానని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మూసీ కాలుష్యం నీటితో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు గోసపడుతున్నారని, ప్రజల కన్నీటిగోస తీర్చడానికి ఆరునూరైనా మూసీ ప్రక్షాళన చేసి గోదావరి జలాలతో నింపి తీరుతానని అన్నారు.

గుట్ట అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
ప్రభుత్వం యాదగిరిగుట్ట అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వంలోభక్తులకు కల్పించని సౌకర్యాలు కావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. గుట్టమీద ఎవరూ నిద్రించవద్దని గత ప్రభుత్వం విధించిన నిషేధాన్ని తాము అధికారంలోకి రాగానే ఎత్తివేశామన్నారు. గుట్టపైకి ఆటోలను అనుమతించామని గుర్తుచేశారు. మహిళల అభివృద్ధిలో భాగంగా ఇందిరామహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, అమ్మ ఆదర్శ పాఠశాలలు, విద్యార్థులకు యూనిఫాం కుట్టే పనులను అప్పగించామన్నారు. మహిళలపేరునే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం, మందుల సామెల్, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, తీన్మార్ మల్లన్న, శ్రీపాల్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, బండ్రు శోభారాణి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసిన పనులు ఇవే..
- రూ.574.56 కోట్లతో గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు
- రూ.183 కోట్లతో మెడికల్ కాలేజీ భవన నిర్మాణానికి
- రూ.25.50 కోట్లతో యాదగిరిగుట్ట మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు
- రూ.7.50 కోట్లతో కొలనుపాక గ్రామంలో హైలెవెల్ బ్రిడ్జి పనులకు
- రూ.6 కోట్లతో కాల్వపల్లి గ్రామంలో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు
- రూ.8.25 కోట్లతో మోటకొండూరులో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ నిర్మాణం పనులకు
- రూ.22.75 కోట్లతో దాతర్‌పల్లి గ్రామంలో 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ల నిర్మాణ పనులకు
- రూ.21.14 కోట్లతో ఆలేరు నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు
- రూ.2.75 కోట్లతో ఆలేరు మార్కెట్ కమిటీలో 2500 మెట్రిక్ సామర్థ్యం గల గోడౌన్ల నిర్మాణ పనులకు

సభకు హాజరైన జనం



ప్రతి పేదవాడికి ఆహారభద్రత
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి




రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఆహారభద్రత కల్పించడమే ధ్యేయమని భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ కల నేరవేర్చేందుకే సన్నబియ్యం పథకం తీసుకువచ్చి, అమలు చేస్తున్నామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రతి వ్యక్తి, ప్రతి రైతు మూసీ పునరుజ్జీవానికి మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. బునాదిగాని కాల్వ, పిల్లాయిపల్లి కాల్వ, ధర్మారెడ్డి కాల్వలను పూర్తి చేస్తామని, భూసేకరణ బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలని సూచించారు. గంధమల్ల రిజర్వాయర్‌ను ముంపు లేకుండా సామర్థ్యాన్ని 1.4 టీఎంసీలకు తగ్గించి 60 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

వాగ్దానాలన్నీ నెరవేరుస్తున్నాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తున్నామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని చెప్పారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారు చాలా పవర్‌ఫుల్ అని, ఆయన దీవెనలతోనే తమ ప్రభుత్వం వచ్చిందన్నారు. దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, భక్తులు కల్పించాలని సౌకర్యాలపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తన దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయడంతో పాటు యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మరో ఐదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమన్నారు. ప్రతి కుటుంబంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందన్నారు.

ఇక్కడి ప్రజల అదృష్టం
- ప్రభుత్వ విప్ అయిలయ్య



ఆలేరు పేరును సువర్ణ అక్షరాలతో లిఖించబడిన రోజు అని, ఒకేసారి రూ.1000 కోట్లపైనా అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శంకుస్థాపన చేయడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నట్టు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గంధమల్లను రిజర్వాయర్‌ను నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజాప్రభుత్వంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మల్లన్నసాగర్ ద్వారా ఆలేరు నియోజకవర్గంలో 100కు పైగా చెరువును నింపుకున్నామన్నారు. గత ప్రభుత్వం గ్రామాల్లో పాఠశాలలకు బదులుగా మద్యం దుకాణాలు ఇస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు, మెడికల్ కళాశాలలను నిర్మాణం చేస్తుందన్నారు.

విద్యారంగ సమస్యలను విస్మరించడం తగదు

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర కేబినెట్ సమావేశంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను విస్మరించడం తగదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పబ్బతి వెంకటేశ్వర్లు, ప్రధాన ప్రధాన కార్యదర్శి కొచ్చర్ల వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపవిద్యాధికారి, ఎంఈఓ పోస్టులు ఖాళీగా ఉండి ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారని పేర్కొన్నారు. సీపీఎస్ విధానం రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు.

'భూ భారతి'తో మెరుగైన సేవలు



సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నూతనకల్ : భూ భారతి చట్టం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతాయని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం నూతనకల్ మండలం తాళ్లసింగారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం సోమ్లాతండాలో రేషన్ దుకాణంలో రికార్డులు, వన నర్సరీలను పరిశీలించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమయపాలన పాటిస్తూ బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ పండ్ల మొక్కలు అందించేలా స్థానిక సిబ్బంది పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నూతనకల్ తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

• బక్రీద్‌కు ముస్తాబు



బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ముస్తాబైన సూర్యాపేట పట్టణంలోని గాంధీనగర్ శివారులో గల ఈద్గా

• బడి బాట ప్రారంభం



ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూరులో శుక్రవారం ప్రారంభించిన బడి బాట ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు

పంట నష్టపరిహారం విడుదల

- ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ. 110.40 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం
- త్వరలోనే రైతులకు అందనున్న పరిహారం

పంట నష్టం ఎకరాల్లో..	1,104.07
నష్టపోయిన రైతులు	662
విడుదలైన పరిహారం	రూ.110.40 కోట్లు



వర్థమానుకోటలో నేలకొరిగిన వరిపైరు (ఫైల్)

నాగారం : మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలకు, వడగళ్లకు జిల్లాలోని పలు మండలాల్లో వరి, మొక్కజొన్న, మామిడి పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పంట నష్ట పరిహారం విడుదల చేసింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున జిల్లా వ్యాప్తంగా 662 మంది రైతులకు రూ.110.40 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 1,104.07 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం జరిగినట్లుగా ఇందులో ముఖ్యంగా వరిపంట భారీగా దెబ్బతిన్నట్లుగా అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.

రైతన్నకు ఊరట!
బోరు బావుల్లో నీరుండడంతో వరిపంట సాగుకు రైతులు పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టారు. అయితే అకాల వర్షాలు అన్నదాతలకు కడగళ్లు మిగిల్చాయి. మామిడి కాయలు సైతం నేల రాలాయి. ఎట్టకేలకు పరిహారం విడుదలైన పంట నష్టపరిహారంతో రైతులకు కొంత ఊరట కలిగిస్తోంది. పంట ఎంత నష్టపోయినా ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ప్రకటించింది.

త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ



ప్రభుత్వం జిల్లాకు రూ.110.40 కోట్ల పంట నష్టపరిహారం విడుదల చేసింది. ఈ పరిహారం డబ్బులను త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.
- జి.శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, సూర్యాపేట

మోడల్ కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : ఒక్కో ఐసీడీఎస్ ప్రాజెక్టుకు ఒక్కో అంగన్‌వాడీ కేంద్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేట్ ప్లే పాఠశాలలకు దీటుగా మార్చేందుకు ఒక్కో సెంటర్‌కు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.12 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ ఇంజనీర్ల ద్వారా అంచనా విలువలు తయారు చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పనులు చేపట్టాలని సూచించారు. బడిబాట కార్యక్రమంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు ప్రీ స్కూల్‌లో చేరేలా ప్రచారం చేయాలన్నారు. ఇంటి స్థలం ఉన్న ట్రాన్స్‌జెండర్స్‌కు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, అలాంటి వారిని గుర్తించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డి డబ్ల్యూఓ నరసింహారావు, సీడీపీఓలు రూప, శ్రీవాణి, శ్రీజ, పారిజాత, నిర్మల, కిరణ్మయి, సూపర్‌వైజర్లు చంద్రిక, అరుణ, సునీత, డీసీపీఓ రవి, మహిళా సాధికారత కోఆర్డినేటర్ చైతన్య, సఖి ఇన్‌చార్జి హేమలత, ఎఫ్ఆర్ఓ వినోద్, పోషణ్ అబ్యాన్ కోఆర్డినేటర్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట : ఆపరేషన్ కగార్ పేరిట సాగిస్తున్న హత్యాకాండను వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన వామపక్ష పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వరుస కాల్పుల కారణంగా ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 27మందిని ఎన్‌కౌంటర్ చేయడం దారుణ చర్య అన్నారు. అది మరువక ముందే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌ను దారుణంగా కాల్చి చంపారని ఆరోపించారు. ఈ ఘటనను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. చర్చలకు తాము సిద్ధమేనని మావోయిస్టులు పదేపదే చేసిన విజ్ఞప్తులను కేంద్ర ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టి శోచనీయమన్నారు. పైగా ప్రధాని, హోంమంత్రి ఎన్‌కౌంటర్‌పై హర్షం వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. జూన్ 9న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద కాంగ్రెస్, బీఆర్‌ఎస్, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంసీపీ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, గంట నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు బాసటగా ఎస్‌బీఐ ఇన్సూరెన్స్



హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ నరసింహ

- ఎస్పీ కె.నరసింహ

సూర్యాపేటటౌన్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఇన్సూరెన్స్ స్కీం పోలీస్ కుటుంబాలకు ఆర్థిక బాసటగా నిలుస్తోందని ఎస్పీ కె.నరసింహ అన్నారు. తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల మరణించిన హెడ్ కానిస్టేబుల్ రమేష్ కుటుంబానికి పోలీస్ సాలరీ ప్యాకేజీ ఎస్‌బీఐ అంకౌంట్ ఇన్‌స్టూ ద్వారా మంజూరైన రూ.10 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసువాలని, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ స్కీంను రూపొందించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముఖ్య అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఓ మంజు భార్గవి, పోలీసు సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూర్యాపేట రీజినల్ మేనేజర్ అనిల్ కుమార్, చీఫ్ మేనేజర్ విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీ బక్రీద్ శుభాకాంక్షలు

సూర్యాపేటటౌన్ : బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ ముస్లింలకు శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిధిలోని ఈద్గాలు, మసీద్‌ల వద్ద, ప్రధాన చౌరస్తాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. సామాజిక మధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టా గ్రామ్ తదితర వాటిలో ఇతరులను కించపరిచేలా పోస్టులు పెట్టవద్దని, సోషల్ మీడియాపై పోలీసుల నిఘా ఉందని తెలిపారు. ఎవరైనా అనుచిత పోస్టులు పెడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండగను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.

క్లుప్తంగా

గుమ్మడవెల్లిలో మేకల చోరీ

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో మేకల దొడ్డిలో ఉన్న పది మేకలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎస్ఐ రమేష్, బాధితురాలు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్‌కె.షరీఫ్‌బీ మేకలను పెంచుతూ జీవనం సాగిస్తోంది. రోజు మాదిరిగా మేకలను పొలానికి మేత కోసం 50 మేకలను తీసుకెళ్లింది. గురువారం సాయంత్రం ఊర్లో ఉన్న తన మేకల దొడ్డిలో కట్టేసి ఇంట్లో నిద్రిస్తోంది. ఈ సమయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 10 మేకలను ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీర రమేష్ తెలిపారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్

నల్లగొండ: జిల్లా బాలల పరిరక్షణ విభాగం, పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, క్లాక్‌టవర్, రద్దీ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న 17 మందిని గుర్తించి సఖీ సెంటర్‌కు తరలించారు. అనాథలైన నలుగురికి వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. మిగతా 13 మందిని వారి సంబంధిత వ్యక్తులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు మోహన్‌రావు, మానస, హరిత, గణేష్, నాగిరెడ్డి, వెంకన్న, తేజస్విని, విద్య, రాము, పోలీసులు, సఖీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

అర్వపల్లి : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గుండాల లింగరాజు శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన రెవెన్యూ సదస్సులో పాల్గొని సూర్యాపేటకు వెళ్తున్నారు. మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అతడిని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సైబర్ మోసానికి పాల్పడిన ఇద్దరిపై కేసు

నూతనకల్ : సైబర్ నేరానికి పాల్పడిన వారిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నూతనకల్ మండల పరిధిలోని బిక్కుమళ్ల గ్రామానికి చెందిన బ్రహ్మాండ్లపల్లి ప్రభాకర్‌కు మిర్యాలగూడ పట్టణానికి చెందిన దూపల్లి సతీష్, మహ్మద్ ఫరూక్ అలీలు తాము బ్యాంక్ రికవరీ ఏజెంట్లుగా పనిచేస్తున్నామని ఫోన్ చేశారు. బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన ఇంటిని తక్కువ ధరకు ఇప్పిస్తామని నమ్మబలికారు. ఇంటి ఫొటోలు వాట్సాప్ ద్వారా పంపించారు. రిజిస్ట్రేషన్ చార్జీలు, ప్రాసెసింగ్ చార్జీలు కట్టాలని చెప్పారు. దీంతో ప్రభాకర్ రూ. 8లక్షల66వేల 500లు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. అనంతరం వారు ఫోన్ ఎత్తకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న మహా కుంభాభిషేకం

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో గల శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. శ్రీరామలింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, మండప పూజ, మూలమంత్ర జపం, సహస్త్ర కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతలు కంచర్ల కృష్ణారెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

నంబర్లు మార్చి.. నయా దందా!

బీఎస్-3 కార్లకు ఇంజన్, చాసిస్ నంబర్లు మార్పు

- ప్రమాదాల్లో ధ్వంసమైన కార్ల నంబర్లు వేసి విక్రయాలు
- చోరీకి గురైన కారు యజమాని ఫిర్యాదుతో బయటపడ్డ వ్యవహారం

మిర్యాలగూడ : గడువుతీరిన వాహనాలను స్క్రాప్ కింద తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రమాదానికి గురైన వాహనాల ఇంజిన్, చాసిస్ నంబర్లను వీటికి మార్చి అధిక ధరలకు విక్రయిస్తున్న విషయం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో వెలుగు చూసింది. హైదరాబాద్‌లో చోరీకి గురైన ఒక కారును మిర్యాలగూడ పట్టణంలోని మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఒక వ్యక్తి ఇటీవల ఆంధ్రాలో కొనుగోలు చేశారు. ఈ కారును మిర్యాలగూడలోని ఓ కారు షెడ్డులో మరమ్మతు చేయిస్తుండగా కారు జీపీఎస్ ఆన్ అయ్యింది. రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో కారు చోరీకి గురైనట్లు యజమాని అక్కడ ఫిర్యాదు చేశాడు. కారు జీపీఎస్‌ను ఆధారం చేసుకొని మిర్యాలగూడకు వచ్చిన సదరు యజమాని.. విషయాన్ని పోలీసులకు తెలిపాడు. కారు ఇంజన్ నంబర్, చాసిస్ నంబర్ మార్చి ఉన్నట్లుగా గుర్తించిన మెకానిక్.. విషయాన్ని పోలీసులకు వివరించాడు. దీంతో కారు ఎక్కడ కొనుగోలు చేశారో, ఎవరు అమ్మారో చెప్పాలని పోలీసులు మిర్యాలగూడకు చెందిన వ్యక్తిని ప్రశ్నించారు. ఆయన చెప్పిన వ్యక్తి ఫోన్ స్విచ్చాఫ్ చేసి పరారైనట్లు తెలిసింది.

చాసిస్ నంబర్లు మార్చి అధిక ధరలకు విక్రయాలు

సదరు కారు నంబర్ ఎవరు మార్చారు.. ఎలా మార్చారనే విషయాన్ని విచారణ చేసే క్రమంలో మిర్యాలగూడకు చెందిన ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకొచ్చి ప్రశ్నించారు. దీంతో తాను ఈ కారు నంబర్, చాసిస్ నంబర్ మార్చలేదని.. కానీ, పట్టణంలోని ఒక పార్కింగ్ యార్డు యజమాని పంపించిన మూడు కార్లకు మాత్రం ఇంజన్, చాసిస్ నంబర్లను మార్చినట్లు పోలీసుల ముందు ఒప్పుకున్నట్లు సమాచారం. కాగా ఆ పార్కింగ్ యార్డులో 60 రోజుల సీసీ టీవీ ఫుటేజీ అందుబాటులో ఉంటుందని, పోలీసులు ఈ ఫుటేజీని పరిశీలిస్తే ఇలాంటి కార్లు ఎన్ని ఉన్నాయో వెలుగు చూసే అవకాశం ఉంది. పోలీసు ఉన్నతాధికారులు ఈ అక్రమ దందాపైన ప్రత్యేక నిఘా పెట్టి కూపీ లాగితే సంచలన విషయాలు బయటపడనున్నాయి. సుమారు నాలుగేళ్ల క్రితం ఢిల్లీ, పాండిచ్చేరికి చెందిన సుమారు 20 వాహనాలను తెలంగాణకు తీసుకొచ్చి ఇదే రీతిలో విక్రయాలు జరిపిన ముఠా గుట్టును అప్పటి పోలీసులు ఛేదించారు. పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టి ప్రత్యేక విచారణ జరిపితే అక్రమ దందా గుట్టు బయటపడుతుంది.



ఇంజన్,చాసిస్ నెంబర్లు మార్చిన కారును పట్టుకున్న పోలీసులు

సమగ్ర దర్యాప్తు చేస్తున్నాం

బీఎస్-3 వాహనాలకు ఇంజన్, చాసిస్ నంబర్లను మార్చి విక్రయాలు జరుపుతున్న వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నాం. ఈ విషయంలో దోషులు ఎంతటి వారైనా ఉపేక్షించం. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నాం. ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్రం ఎంత.. వాహనాలను కొనుగోలు చేసిన వారు, వాహనాలను విక్రయించిన ప్రధాన సూత్రధారి ఎవరన్న విషయాలు త్వరలోనే గుర్తిస్తాం.

– రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ

బీఎస్-3 వాహనాలను తక్కువ ధరకు కొనుగోలు

మిర్యాలగూడలోని కారు గురించి కూపీ లాగడంతో బీఎస్-3 వాహనాల దందా కూడా బయటపడింది. 2019లో భారత ప్రభుత్వం నిర్ణీత గడువు తీరిన తరువాత బీఎస్-3 కార్లను విక్రయించవద్దని ఆదేశాలు జారీచేసింది. దీంతో షోరూమ్‌ల యజమానులు చాసిస్, ఇంజన్ నంబర్లను తొలగించి వాటిని స్క్రాప్ కింద విక్రయించినట్లు సమాచారం. ఈ కార్లను అతి తక్కువ ధరలకు స్క్రాప్ కింద కొనుగోలు చేసుకుని రోడ్డు ప్రమాదాల్లో ధ్వంసమైన కార్ల ఇంజన్, చాసిస్ నంబర్లను అమర్చి బీఎస్-3 వాహనాలను అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు. ఈ దందా భారీగానే కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ విధంగా ఎన్ని వాహనాలకు నంబర్లు మార్చారు.. ఎన్ని కార్లను అధిక ధరలకు విక్రయించారనే కోణంలో పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



రేణుక ఎల్లమ్మ - జమదగ్ని కల్యాణ మహోత్సవంలో తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

- పట్టువస్త్రాలు సమర్పించిన ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ చైర్మన్ దంపతులు

కనగల్: దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి- జమదగ్ని మహర్షి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కల్యాణ మండపానికి తీసుకువచ్చి బ్రహ్మశ్రీ దేరం భాస్కర శర్మ, ఆలయ అర్చకులు నాగోజు మల్లాచారి, చిలకమర్రి శ్రవణచారి, గాదె మహేష్, గాదె దామోదర్‌రావు, ఫణి, శ్రీను, వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం జరిపించారు. అంతకుముందు సుప్రభాతసేవ, లలితాసహస్ర నామార్చన, బాలభోగ నివేదన నిర్వహించారు. శనివారం ఉదయం 108కలశాలతో అష్టోత్తర శతఘటాభిషేకం, సాయంత్రం 4గంటలకు దర్వేశిపురం, పర్వతగిరి గ్రామస్తులు బోనాలు సమర్పించనున్నారు.

అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

అమ్మవారికి ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్‌రావు, ఆలయ చైర్మన్ చేదేటి వెంకట్‌రెడ్డి దంపతులు ప్రభుత్వం తరుపున ఈఓ జల్లేపల్లి జయరామయ్యతో కలిసి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు వీరికి వేద ఆశీర్వచనం చేశారు. అమ్మవారి కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో నల్లగొండ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏదుళ్ల మధుసూదన్‌రెడ్డి, ఆర్టీఏ మెంబర్ కూసుకుంట్ల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోలి నర్సిరెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, యాదగిరి పాలకమండలి సభ్యులు నగేష్‌గౌడ్, నవీన్ గౌడ్, శంకర్‌రెడ్డి, రాజు, రమేష్, వెంకన్న, బాబు, సైదులు, దుర్గమ్మ, ప్రభాకర్ పాల్గొన్నారు.



కల్యాణానికి హాజరైన భక్తులు

ముగిసిన హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు



బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన వరంగల్ జట్టుకు బహుమతులు అందజేస్తున్న జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి నర్సిరెడ్డి, సీఐ రాజశేఖర్

- బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన కరీంనగర్ జట్టు
- బాలికల విభాగంలో వరంగల్ జట్టుకు ప్రథమ బహుమతి

నకిరేకల్ : నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 47వ తెలంగాణ హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు శుక్రవారం ముగిశాయి. బాలుర విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో వరంగల్ జట్టు, తృతీయ స్థానంలో నల్లగొండ జట్టు నిలిచింది. బాలికల విభాగంలో వరంగల్ జట్టు ప్రథమ స్థానం, ఖమ్మం జట్టు ద్వితీయ, రంగారెడ్డి జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించాయి. విజేతలకు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి నర్సిరెడ్డి బహుమతులు, షీల్డులు అందజేశారు. వీరంతా ఈనెల 18 నుంచి బీహార్‌లోని నవాడలో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులు స్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ మాట్లాడుతూ మారుమూల గ్రామమైన మంగళపల్లిలో రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించడం హర్షణీయమన్నారు. ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాలయ పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ రాజశేఖర్, ఎస్ఐ లచ్చిరెడ్డి, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం కర్ర వీరారెడ్డి, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పలస రజిత, డాక్టర్ పైళ్ల భరద్వాజ్, స్థానిక నాయకులు లక్ష్మయ్య, పాపయ్య, ప్రకాష్‌రావు, పైళ్ల లింగయ్య, లింగరావు, మునీందర్‌రావు, సూరజ్‌కుమార్, వంటల ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



బాలుర విభాగంలో బహుమతి అందుకుంటున్న తృతీయ స్థానంలో నిలిచిన నల్లగొండ జట్టు

తలసేమియా బాధితుడికి ఆర్థికసాయం



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న రాపోలు యాదగిరి

సాక్షి ఎఫెక్ట్..

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన బల్లెం స్వరూప అబ్బయ్యల పెద్ద కుమారుడు బల్లెం ప్రణయ్ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఆపరేషన్ చేయించేందుకు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో బుధవారం సాక్షి దినపత్రికలో 'దాతలు సహాయం చేయరూ' శీర్షికన కథనం ప్రచురించింది. శివన్నగూడ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, రామలింగేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ రాపోలు యాదగిరి స్పందించి ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం రూ.లక్ష చెక్కును ప్రణయ్ తల్లిదండ్రులకు శుక్రవారం అందజేశారు. గట్టుప్పల్‌కు చెందిన టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి సిద్దగోని మహేష్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సమస్యను వివరించగా బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- విద్యుత్ తీగలు లాగుతుండగా ఘటన



నందు (ఫైల్)

నిడమనూరు : విద్యుత్ తీగలు లాగుతుండగా ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం నిడమనూరు మండలంలోని ముప్పారం సబ్‌స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. ముప్పారం సబ్‌స్టేషన్‌కు అర కిలోమీటరు దూరంలో విద్యుత్ లైన్ల ఏర్పాటుకు కాంట్రాక్టర్ సతీష్ కూలీలతో పనులు చేయించేందుకు లైన్‌మన్ పోలె పాపయ్య ద్వారా ముప్పారం సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు లైన్ కట్ (ఎల్‌సీ) తీసుకున్నారు. విధుల్లో ఉన్న సబ్ స్టేషన్ ఆపరేటర్ అమ్జద్ ఖాన్ విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అయితే పనులు పూర్తికాక ముందే తిరిగి లైనమన్ ఆదేశాలతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో పనులు చేస్తున్న త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామానికి చెందిన కుర్రి నందు(20) విద్యుదాఘాతంలో అక్కడికక్కడే మృతి చెందాడు.

సబ్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

ముప్పారం సబ్‌స్టేషన్ ఎదుట నందు మృతదేహంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. తుమ్మడం గ్రామానికి చెందిన సతీష్ వద్ద ఏడాదిగా గ్రామంలోని పలువురు మిత్రులతో కలిసి నందు విద్యుత్ పనులు చేస్తున్నాడని పేర్కొన్నారు. విద్యుత్ తీగలు లాగుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడని పేర్కొన్నారు. నందు పైనే తమ కుటుంబం ఆధారపడి ఉందని, అతడి తండ్రి శ్రీను అనారోగ్యంతో ఉన్నాడని, తల్లి పార్వతమ్మ గ్రామంలో కూలీ పనులకు వెళ్తుందని బంధువులు తెలిపారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆందోళనకు దిగారు. నిడమనూరు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

గంధమల్ల పరిహారంలో స్పష్టత లేదు

- సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన ప్రాజెక్టు నిర్వాసితులు

తుర్కపల్లి : గంధమల్ల ప్రాజెక్టుకు సంబంధించిన పరిహారంలో స్పష్టత లేదని నిర్వాసితులు నిరసన తెలిపారు. శుక్రవారం గంధమల్ల గ్రామంలో ప్రధాన కూడలి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. భూసేకరణ కింద వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి తగిన పరిహారం, పునరావాసం అందించాలని చౌక్లతండా వాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గ్రామంలో నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సాప అశోక్, నాగాయిపల్లి యాదగిరి, కనకయ్య, జక్కుల శ్రీశైలం, వెంకటేష్, మల్లెష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టబొమ్మను దహనం చేస్తున్న బాధితులు

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

- సినీ హీరో మంచు విష్ణు

కొండమల్లేపల్లి : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సినీ హీరో, మా అధ్యక్షుడు మంచు విష్ణు అన్నారు. హీరో మంచు విష్ణు ఆర్థిక సహకారంతో క్రైస్తవ జన సమితి ఆధ్వర్యంలో సమకూర్చిన అంబులెన్స్‌ను శుక్రవారం ఆయన మరో సినీ హీరో శివ బాలాజీతో కలిసి దేవరకొండలో ప్రారంభించారు. అంబులెన్స్ ఏర్పాటుకు కృషి చేసిన క్రైస్తవ జన సమితి అధ్యక్షుడు మాసారం ప్రేమ్‌కుమార్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న హీరోలు మంచు విష్ణు, శివ బాలాజీ

సబ్ కలెక్టర్ బంగ్లాలో అగ్ని ప్రమాదం

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపులో గల సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ బంగ్లా (నివాసం)లో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. గదిలో ఉన్న ఫర్నిచర్ దగ్ధమైంది. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ నివాసం వద్దకు చేరుకోగా అప్పటికే పొగతో గది నిండిపోయింది. సబ్ కలెక్టర్ వ్యక్తిగత గది కార్యాలయంలో ఎయిర్ కండిషన్, కంప్యూటర్ సామగ్రితో పాటు టేబుల్, కుర్చీలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సబ్ కలెక్టర్ నివాసానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని అగ్ని మాపక సిబ్బంది తెలిపారు. సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ తెలిపారు.



మంటలు ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఉజ్వల భవిష్యత్‌కు నవోదయం

- చలకుర్తి నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు జూలై 29 వరకు గడువు
- ఉమ్మడి జిల్లాకు 80 సీట్లు

పెద్దవూర: నవోదయ విద్యాలయాల్లో 2026- 2027 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవటానికి జూలై 29 ఆఖరు తేదీగా నిర్ణయించారు. ఈ విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్ష 2025 డిసెంబర్ 13 తేదీన నిర్వహించనున్నారు.

ఉన్నత ప్రమాణాలతో కూడిన అధునాతన విద్య

నవోదయ విద్యాలయంలో తమ పిల్లలకు సీటు రావాలని చాలా మంది తల్లిదండ్రులు పోటీపడతారు. గ్రామీణ ప్రాంత ప్రతిభావంతమైన విద్యార్థులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఉన్నత ప్రమాణాలతో కూడిన అధునాతన విద్యను అందిచటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో 1986 జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి నల్లగొండ జిల్లా చలకుర్తి గ్రామంలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో 45 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య, బాల, బాలికలకు వేర్వేరుగా వసతి సౌకర్యం కల్పించారు. విద్యాబోధన 6 నుంచి 8వ తరగతి వరకు ప్రాంతీయ భాష లేదా మాతృ భాషలో జరుగుతుంది. గణితం, సైన్స్ సబ్జెక్టులు ఆంగ్లభాషలోనూ, సామాజిక శాస్త్రములు హిందీలోనూ బోధిస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతిలో 80 మంది విద్యార్థులు, 11, 12 తరగతుల్లో 40 మంది చొప్పున విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.



చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం

కష్టపడితే సీటు ఖాయం

విద్యార్థులు ప్రణాళికతో కష్టపడితే సీటు సాధించవచ్చు. ముఖ్యంగా రీజనింగ్‌లో అన్ని ప్రశ్నలు కరెక్ట్‌గానే అనిపిస్తాయి. కొంచెం లోతుగా ఆలోచించటం, బాగా ప్రాక్టీస్ చేస్తేనే ఫలితం ఉంటుంది. తక్కువ సమయంలో సమాధానం చేయాలి కాబట్టి సాధన ముఖ్యం. ఇందులో సీటు వస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. ప్రవేశ పరీక్ష ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో పారదర్శకంగా నిర్వహిస్తాం. ప్రశ్నపత్రం తయారీ నుంచి విద్యార్థుల ఎంపిక వరకు జరిగే అన్ని ప్రక్రియలను సీబీఎస్ఈ వారే నిర్వహిస్తారు.

– ఎదునందన్, చలకుర్తి జేఎన్‌వీ ప్రిన్సిపాల్

దరఖాస్తు చేసుకునే విధానం

విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం చేయించిన తర్వాతనే వెబ్‌సైట్‌లో నందు అప్‌లోడ్ చేసి అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. 5వ తరగతి ఏ పాఠశాలలో చదువుతున్నారో అక్కడి నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకుని అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తు ఫారంపై విద్యార్థి, తండ్రి సంతకాలు తప్పకుండా ఉండాలి. ఫొటో కూడా అప్‌లోడ్ చేయాలి. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు www. jnvnalgonda. in లేదా www. navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకోవటానికి జూలై 29 ఆఖరు తేదీగా నిర్ణయించారు.

అర్హతలు

ప్రవేశం కోసం విద్యార్థులు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతూ 01.05.2014 నుంచి 31.07.2016ల మధ్య జన్మించిన వారు అర్హులు. ఈ నిబంధన ఎస్సీ, ఎస్టీ సహా అన్ని వర్గాల వారికి వర్తిస్తుంది. ప్రవేశ పరీక్ష 2025 డిసెంబర్13 తేదీన ఉదయం 11.30 నుంచి 1.30 వరకు రెండు గంటల పాటు నిర్వహిస్తారు.

పరీక్ష విధి, విధానాలు

ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో మూడు విధాలుగా ఉంటుంది. మూడు విభాగాల్లో కలిపి 80 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కు చొప్పున కేటాయిస్తారు. ప్రతి విభాగంలోనూ లఘుప్రశ్నలు(ఆబ్జెక్టివ్ టైప్) ఉంటాయి. రీజనింగ్ (మేథోశక్తి)పై 40 ప్రశ్నలకు 50 మార్కులు (60 నిమిషాల కాలవ్యవధి), గణితంపై 20ప్రశ్నలకు 30 నిమిషాలు, భాషా పరిజ్ఞానంపై 20 ప్రశ్నలకు 30 నిమిషాలు, మొత్తం రెండు గంటల్లో 80 ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. విద్యార్థులు సమాధానాలను ఐసీఆర్/ఓఎంఆర్ పత్రంలో పూరించాలి. ప్రవేశ పరీక్షకు ఇంకా 6 నెలల సమయం ఉన్నందున విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివితే విజయం సాధించడం సులభమవుతుంది.

రిజర్వేషన్ విధానం

ఆరో తరగతిలో మొత్తం 80 సీట్లు ఉండగా అందులో 75 శాతం సీట్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు. గ్రామీణ ప్రాంత రిజర్వేషన్ వర్తించాలంటే 3, 4, 5 తరగతులు గ్రామీణ ప్రాంతాల్లో చదివి ఉండాలి. పట్టణ ప్రాంతాల్లోనూ, మున్సిపాలిటీల్లో చదివినా గ్రామీణ ప్రాంత రిజర్వేషన్ వర్తించదు. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7.5 శాతం, బాలికలకు మొత్తం సీట్లలో 1/3 వ రిజర్వేషన్ సౌలభ్యం ఉంది.

పరీక్ష మాధ్యమం

అభ్యర్థి 5వ తరగతిలో ఏ మాధ్యమంలో విద్యాభ్యాసం చేస్తారో.. ఆ భాషలోనే పరీక్ష ఉంటుంది. అభ్యర్థి తాను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫారం, ప్రవేశ పత్రంలో పేర్కొన్న భాషలోనే టెస్ట్ బుక్‌లెట్ ఇస్తారు. దరఖాస్తు ఫారంలోనూ, ప్రవేశ పత్రంలో పరీక్షా మాధ్యమం ఒకేలా ఉండేలా చూసుకోవాలి.